క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దవూర: మండలంలోని నీమానాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని మల్లెవానికుంట తండాలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. వివరాలు.. మల్లెవానికుంటతండాకు చెందిన రమావత్ మహేందర్ తన గేదెలను మంగళవారం మేత కోసం వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. ఈ క్రమంలో అప్పటికే ఈదురుగాలులతో తెగిపడిన విద్యుత్ తీగను ఒక గేదె మేసుకుంటూ వెళ్లి తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం జెండా ఆవిష్కరించిన సంఘం నాయకులు

డిండి: విద్యుత్ శాఖలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మే డే వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్మికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం డిండి సెక్షన్ లీడర్‌గా మూడావత్ శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మధుసూదనాచారి, ప్రేమయ్య, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ధన్‌సింగ్, శ్రీనివాస్, శివ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పిస్తున్న విజయపురిటౌన్ ఎస్ఐ సురేష్

నాగార్జునసాగర్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో ముందుకు నడవాలని విజయపురిటౌన్ ఎస్ఐ సురేష్ సూచించారు. మంగళవారం రాత్రి నందికొండ మున్సిపాలిటీ 4వ వార్డులోని బాలవిహార్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సైబర్ క్రైమ్స్ జరుగుతున్న తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాగా హైమద్ అనే వ్యక్తి మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు విరాళం ఇస్తానని హామీ ఇచ్చారు. మరికొంత మంది ముందుకు వస్తే 4వ వార్డులో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో వార్డుకు సంబంధించిన ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమ్మవారి జాతర

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని శ్రీ మహిసాసురమర్ధిని అమ్మవారి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఆదివారం ప్రారంభమైన ఈ జాతరలో భాగంగా మంగళవారం గ్రామంలో పుట్ట బంగారం(పుటాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలతో భక్తులు పుట్ట వద్దకు వెళ్లి పుట్ట బంగారం తీసుకొచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నాగుల చెరువు కబ్జాపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండల కేంద్రం శివారులోని నాగుల చెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేయగా రెవెన్యూ, ఐబీ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గణేష్ మాట్లాడుతూ.. నాగుల చెరువు కబ్జాకు గురవుతుందని గతేడాది ధీరావత్ శ్రీను అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. లోకాయుక్త ఆదేశానుసారం నాగుల చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై సర్వే జరిపినట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వే నివేదికను లోకాయుక్తకు సమర్పించనున్నట్లు తెలిపారు.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అంగడిపేట తండాలో మంగళవారం పిడుగుపడి తాటిచెట్టుపై మంటలు చెలరేగాయి. తాటి చెట్టుపై మంటలు చూసి తండావాసులు భయాందోళనకు గురయ్యారు. పిడుగు పడిన సమయంలో తాటిచెట్టు చుట్టుపక్కన ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పోలీస్ స్టేషన్ల పరిధి ఇంకెప్పుడు మారేది?

- మాడుగులపల్లి మండలంలోని పలు గ్రామాలు పాత పీఎస్‌ల ఆధీనంలోనే
- కొత్త మండలంగా ఏర్పాటై ఎనిమిదేళ్లు కావొస్తున్నా ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఇబ్బందుల్లో ఫిర్యాదుదారులు

మాడుగులపల్లి: తెలంగాణ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2016 అక్టోబర్‌లో మాడుగులపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేసింది. ఉమ్మడి వేములపల్లి మండలం నుంచి 10 గ్రామాలు, నిడమనూరు నుంచి 2, తిప్పర్తి నుంచి 5, త్రిపురారం నుంచి 3 గ్రామాలు(మొత్తం 20 పంచాయతీలు) ఈ మండలంలో భాగమయ్యాయి. 500 లోపు జనాభా ఉన్న గ్రామాలను సైతం ప్రభుత్వం పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఈ సంఖ్య 28కి పెరిగింది. రెవెన్యూ పరంగా అన్ని గ్రామాలు మాడుగులపల్లి మండలంలో విలీనం కాగా వీటిలో కొన్ని గ్రామాలు ఇప్పటికీ ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే కొనసాగుతున్నాయి.

ఏఏ గ్రామాలు.. ఏ స్టేషన్ పరిధంటే..

బొమ్మకల్లు, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, పోరెడ్డిగూడెం గ్రామాలే వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతుండగా.. ధర్మాపురం, మాచినపల్లి, గోపాలపురం గ్రామాలు నిడమనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. పోలీస్ స్టేషన్ల పరిధిపై అవగాహన లేని వారు సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. అక్కడికి వెళ్లిన ఫిర్యాదుదారులను సిబ్బంది వేములపల్లి, నిడమనూరు స్టేషన్లకు పంపుతున్నారు.



మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ భవనం

అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు..

బొమ్మకల్లు, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, పోరెడ్డిగూడెం గ్రామాలు వేములపల్లి నుంచి 20కి.మీ. దూరంలో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వీటిల్లో కొన్ని గ్రామాలకు పోలీసు సిబ్బంది చేరుకోవాలంటే సమయం పడుతోంది. 100 నంబర్‌కు ఫిర్యాదులు అందినప్పుడు నిర్ణీత సమయంలో చేరాలంటే ఇబ్బంది పడుతున్నామని పోలీసు సిబ్బంది వాపోతున్నారు. ధర్మాపురం, గోపాలపురం, మాచినపల్లి గ్రామాలు సైతం నిడమనూరు పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉండడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

జాప్యం అందుకేనా.?

కొత్త మండలాల ఏర్పాటు సమయంలో మండలంలోని గ్రామాల సంఖ్యను ప్రాతిపదికన తీసుకొని పోలీసుశాఖ స్టేషన్ల పరిధిని నిర్ధారించింది. మాడుగులపల్లి మండలంలో 28 గ్రామాలుండగా వీటిని పూర్తిస్థాయిలో అదే పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువస్తే ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు స్టేషన్ల పరిధిలో గ్రామాల సంఖ్య తగ్గి కేసులూ తగ్గుముఖం పట్టే అవకాశముంది. అత్యధిక గ్రామాలున్న స్టేషన్ పరిధిలో కేసుల సంఖ్య పెరిగి సిబ్బందిపై ఒత్తిడి పెరిగే ఆస్కారం ఉంది. ఈ కారణంగానే పోలీసు శాఖ మాడుగులపల్లి రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాలను ఉమ్మడి మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోనే కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఇబ్బందులు తలెత్తుతున్నాయి



మా గ్రామం రెవెన్యూ, పోలీస్ స్టేషన్ పరిధి వేర్వేరు కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే నిడమనూరు స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. పోలీస్ స్టేషన్ల పరిధిపై అవగాహన లేని గ్రామస్తులు నేరుగా మాడుగులపల్లి వెళ్తున్నారు. అక్కడి సిబ్బంది వారిని తిరిగి నిడమనూరుకు పంపుతున్నారు.

– బోడ యాదయ్య, గోపాలపురం గ్రామస్తుడు

పోలీస్ స్టేషన్ల పరిధి మార్చాలి



రెవెన్యూ గ్రామాలన్నీ ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటే ఇబ్బంది ఉండదు. మాడుగులపల్లి మండలంలో వివిధ గ్రామాలు రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉండడంతో ఫిర్యాదుదారులు, ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పోలీస్ స్టేషన్ల పరిధి మార్పునకు చర్యలు తీసుకోవాలి. కొత్త మండలంలో సమస్యలన్నింటిని పరిష్కరించాలి.

– పుల్లెంల సైదులు, జెడ్పీటీసీ, మాడుగులపల్లి

భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిండి మండలం వీరబోయినపల్లి కెనాల్ కింద ముంపునకు గురైన 11మంది భూ నిర్వాసితులకు రూ.40లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ముంపునకు గురైన కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో డిండి, నక్కలగండి ప్రాజెక్టులతో పాటు 5 లిఫ్టులు పూర్తయితే రాష్ట్రంలో ఎక్కువ రిజర్వాయర్లు గల నియోజకవర్గంగా దేవరకొండ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు, జెడ్పీటీసీ బాలూనాయక్, రాజినేని వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, బొడ్డుపల్లి కృష్ణ తదితరులున్నారు.



భూ నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

మిర్యాలగూడ టౌన్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘం మిర్యాలగూడ డివిజన్ నేత మట్టపల్లి చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వీఓఏలను సీసీలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, వీఓఏలపై మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రూ.10లక్షల వరకు సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, దేవకి, ప్రవీణ్, వాణి, శైలజ, రాజేశ్వరీ, రజనీ, నాగమణి, మంగమ్మ, బగ్గునాయక్, జానయ్య, వాణి తదితరులున్నారు.



మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమ్మె చేస్తున్న వీఓఏలు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మాడుగులపల్లి: కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



దామరచర్ల: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మాడుగులపల్లి: రాష్ట్రంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు కార్యాలయం ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ జేపీఎస్‌ల సర్వీస్‌ను రెగ్యులర్ చేశారని గుర్తుచేశారు. పంచాయతీ కార్యదర్శుల కృషి వల్లే రాష్ట్రంలోని చాలా గ్రామపంచాయతీలు జాతీయస్థాయి అవార్డులు సాధించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దండ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేందుకు విధివిధానాలు ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో జేపీఎస్‌లు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూసపాటి నరేష్, ఉపాధ్యక్షుడు రమేష్, కోల సాయికుమార్, రామకృష్ణ, శ్రీను, రేవతి, సరిత, శివ, అర్జున్‌రెడ్డి, సాయి, మహేష్, నవీన్, సుధాకర్, కృష్ణ, పున్నయ్య, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు లక్ష్య సాధనకు దోహదపడతాయి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్: క్రీడలు లక్ష్య సాధనకు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంసీకేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి నందికొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడలతో స్నేహసంబంధాలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గుట్టను చెరపట్టిన అక్రమార్కులు

- అనుమతులు లేకుండానే మట్టి తవ్వకం
- చోద్యం చూస్తున్న అధికారులు

నిడమనూరు: మండలంలోని వెనిగండ్ల పరిధిలో గల గుట్ట మట్టిని కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండానే తరలిస్తున్నారు. వెనిగండ్ల శివారులో చిలుకలవాగుకు అవతల(రాజన్నగూడెం) వైపున 102 సర్వే నంబర్‌లో గుట్ట ఉంది. ఇది అసైన్డ్ భూమిగా రికార్డుల్లో నమోదైంది. కాగా కొన్నిరోజులుగా గుట్ట మట్టిని కొందరు యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. ఈ మట్టిని ప్లాట్లు చదును చేయడానికి, బేస్‌మెంట్‌లు నింపడానికి సదరు వ్యక్తులు వినియోగించుకుంటున్నారు. ఎవరైనా అడిగితే మట్టిని కొన్నామని చెప్పుకుంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదని చెబుతున్నారు. అనుమతులు ఇవ్వకున్నా మట్టిని తరలిస్తున్న సమాచారం తెలిసినా సంబంధిత అధికారులు మిన్నకుండిపోతున్నారు. అక్రమార్కులు గుట్ట మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికులు నిలదీసినా వారిని లెక్కచేయకుండా మట్టి తరలిస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు: ప్రమీల, తహసీల్దార్,

మట్టి తవ్వేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. విషయం తెలిసి వీఆర్ఏను అక్కడకు పంపించి విచారిస్తున్నాం. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం.



వెనిగండ్ల పరిధిలో అనుమతులు లేకుండా గుట్టను తవ్వుతున్న అక్రమార్కులు

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

అడవిదేవులపల్లి: జీఓ నంబర్లు 58, 59 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన వారు వాటి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దేశ్యా సూచించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీలోగా మీసేవలో ఆన్‌లైన్ ద్వారా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని, గతంలో దరఖాస్తులు చేసుకొని తిరస్కరణకు గురైన వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మైనార్టీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెంలో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పాశం వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మొత్తం 80 సీట్లకుగాను 60 సీట్లు మైనార్టీలకు, 20 సీట్లు నాన్-మైనార్టీలకు మెరిట్ ఆధారంగా కేటాయించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు పిట్టలగూడెం గురుకుల కళాశాలలో లేదా 8464850954 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి ఇబ్బందులు తీర్చాలి



స్థానికులతో కలిసి ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్: వేసవిలో తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదంటూ మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెంలో మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా జప్తివీరప్పగూడెంలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామ ప్రజలు పొలాల వద్ద నుంచి బోరు నీళ్లు తీసుకొస్తున్నారని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మిషన్ భగీరథ అధికారులు వెంటనే భగీరథ నీటిని విడుదల చేయాలని, లేదంటే అవంతీపురంలోని మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆటోల్లో పరిమితికి మించితే చర్యలు తప్పవు



ఆటోలో ప్రయాణిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మాడుగులపల్లి: వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి హెచ్చరించారు. మంగళవారం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై 18 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వెళ్తున్న డీఎస్పీ వెంకటగిరి తన వాహనాన్ని నిలిపి ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకూ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల వద్ద జరిగిన ఆటో ప్రమాదం జరిగిన తీరును గుర్తు చేశారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. అదేవిధంగా రాంగ్‌రూట్లో అతివేగంగా టిప్పర్లను నడిపిన ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరిక



కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ అన్నారు. మంగళవారం మండలంలోని ఈదులగూడ 4వ వార్డుకు చెందిన 20మంది కాంగ్రెస్ కార్యకర్తలు మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లమోతు సిద్ధార్థ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మిర్యాలగూడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బొడ్డు నందకిశోర్, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఎలుగుబెల్లి నాగరాజు, నల్లగంతుల నాగభూషణం తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవూర: నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు ఎగ్జిక్యూటివ్ జీఎల్ఎన్ రావు అన్నారు. పెద్దవూర మండలంలోని పాల్తీతండా గ్రామపంచాయతీలో గిరిజన విద్యార్థుల కోసం నాట్కో ట్రస్టు ఉచితంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు మంగళవారం ఆయన క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. వేసవిలో విద్యార్థులకు డ్రాయింగ్, చిత్రలేఖనం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు, ఆటలు, పాటలు, నాటిక ప్రదర్శనలు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా దుస్తులతో విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్ల పరిశీలన

మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో ఈ నెల 26న రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనంతో పాటు మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బస్తీ దవాఖానను మంత్రులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.14కోట్లతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో నిర్మించనున్న వంద పడకల భవనానికి, నియోజకవర్గంలో రూ.5.60కోట్లతో మంజూరైన 28 నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించే పట్టణ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నల్లమోతు సిద్ధార్థ, ఉదయ్‌భాస్కర్, శ్రీధర్, ఖాదర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

కాంగ్రెస్ గెలుపునకు పాటుపడాలి

నిడమనూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముకుందాపురంలో ఇతర పార్టీల నాయకులు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో 10వ వార్డు సభ్యుడు ఆవుల కృష్ణ, ఆవుల భిక్షం, ఆవుల నగేష్, కల్వకుంట్ల చినవెంకన్న, బొడ్డు చినలింగయ్య, ఆవుల సాలయ్య, హుస్సేన్, కోటయ్య, జానయ్య ఉన్నారు. కార్యక్రమంలో కుందూరు జైవీర్‌రెడ్డి, అంకతి సత్యం, సీతారాములు, శ్రీనివాస్, శివరామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

దేవరకొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవరకొండ మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ సక్రునాయక్ అన్నారు. మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో చేపట్టిన రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్ సెంటర్లలో పాత బట్టలు, పాత పుస్తకాలు, పాత చెప్పులు, ప్లాస్టిక్ వస్తువులను అందించాలని ఆయన సూచించారు. మంగళవారం పలు వార్డుల్లో పాత వస్తువుల సేకరణను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ జగమంతు, వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది తదితరులున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

హాలియా: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మేరీ లైఫ్- మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొత్తపల్లి, పంగవానికుంట, హాలియా-4 అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యావరణ పరిరక్షణపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కాకునూరి విజయ, గోవిందమ్మ, నాగజ్యోతి, మంగమ్మ,, ఆయా మంగమ్మ తదితరులు ఉన్నారు.



దేవరకొండ: ఆయా వార్డుల్లో పాత వస్తువుల సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

'సామాజికంగా వెలి వేశారనేది అవాస్తవం'

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని లావుడితండా గ్రామంలో దాతల సహకారంతో నూతనంగా ఆలయాన్ని నిర్మిస్తున్నామని, కానీ ఆలయానికి భూమి ఇవ్వలేదని తమను సామాజికంగా వెలి వేశారని గ్రామానికి చెందిన లావూరి పూరి చేసిన ఆరోపణలు అవాస్తవమని ఆలయ కమిటీ సభ్యులు లింగరాజు చౌహాన్, లావుడి చందు, విజయ్‌కాంత్, బిచ్యా, గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం కోసం గ్రామస్తులు స్వచ్ఛందంగా స్థలం ఇచ్చారని, స్థలం ఇవ్వని వారిని ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని అన్నారు. కావాలనే కొందరు తమపై అసత్య ఆరోపణలు చేస్తూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బహిరంగ చర్చకు రావాలి

చందంపేట: నక్కలగండి ప్రాజెక్టు పనుల పురోగతిపై దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బహిరంగ చర్చకు రావాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కళ్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం చందంపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న రాత్రి కేంద్ర భారీపరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే నక్కలగండి ప్రాజెక్టును సందర్శించగా.. రాత్రివేళ ప్రాజెక్టు పనులు పరిశీలిస్తే ఏం కన్పిస్తుందని ఎమ్మెల్యే మాట్లాడారని, ప్రాజెక్టు పురోగతిపై ఎమ్మెల్యే చర్చకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, అంజినాయక్ తదితరులున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

దేవరకొండ: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బహిరంగ చర్చకు సిద్ధమా అని బీజేపీ గిరిజన మోర్చా నాయకుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి పర్యటనను ఎమ్మెల్యే తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సమావేశంలో బహదూర్‌సింగ్, భూతం వాసుదేవ్, సోమిడి రాజు తదితరులున్నారు.